నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
5 | హైదరాబాద్, మంగళవారం 9 జనవరి 2024 | RANGAREDDY

దరఖాస్తులను వేగంగా కంప్యూటరీకరించాలి

సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, జనవరి 8 : ప్రజాపాలన సందర్భంగా స్వీకరించిన దరఖాస్తులను వేగంగా కంప్యూటరీకరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం ఆయన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తగిన సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా ఎంట్రీ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు

నేటి నుంచి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు

ఏర్పాట్లను పర్యవేక్షించిన డీఈవో

ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న డీఈవో సుశీందర్‌రావు

ఇబ్రహీంపట్నం, జనవరి 8 : రంగారెడ్డి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు మంగళవారం నుంచి ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను డీఈవో సుశీందర్‌రావు సోమవారం పర్యవేక్షించారు. ఈ ప్రదర్శనలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు. జిల్లాలోని మాడల్, జిల్లా, మండల పరిషత్‌లతోపాటు గురుకుల పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో అందుబాటులో ఉంచాలన్నారు. సలహాలు, సూచనల కోసం జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ 9395390985ను సంప్రదించాలన్నారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే

- రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 300 మంది బడిబయటి పిల్లల గుర్తింపు
- ఈ నెల 10 వరకు కొనసాగనున్న సర్వే
- గ్రామాలు, పట్టణాల్లో 81 మంది సీఆర్పీలతో నిర్వహణ
- ఎప్పటికప్పుడు చైల్డ్ ఇన్ఫో ప్రబంధ్ పోర్టల్‌లో వివరాల ఎంట్రీ
- గుర్తించిన పిల్లలను అందుబాటులో ఉన్న స్కూళ్లలో చేర్పిస్తున్న అధికారులు

షాబాద్, జనవరి 8 : ఏ ఒక్క విద్యార్థి కూడా బడిబయట ఉండొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. అందుకోసం సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ ప్రతిఏటా సర్వే నిర్వహిస్తున్నది. దీనిలో భాగంగానే రంగారెడ్డి జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో 81 మంది సీఆర్పీల ఆధ్వర్యంలో ప్రస్తుతం ఇంటింటి సర్వే ముమ్మరంగా సాగుతున్నది. డీఈవో ఆదేశాల మేరకు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫో ప్రబంధ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నారు. డిసెంబర్ 10న ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 10 వరకు కొనసాగనున్నది. సర్వే జరుగుతున్న తీరును ప్రతిరోజూ సెక్టోరల్ అధికారులు పర్యవేక్షించడంతోపాటు వారి నుంచి డీఈవో వివరాలను సేకరిస్తున్నారు.

అర్బన్, రూరల్ ప్రాంతాలవారీగా సర్వే

జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఆమనగల్లు(కల్వకుర్తి), శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాల్లో 1,062 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందుకోసం 81 మంది సీఆర్పీలు అర్బన్, రూరల్ ప్రాంతాలవారీగా సర్వే చేపడుతున్నారు. సర్వేలో 6-14 ఏండ్లు, 15-19 ఏండ్లలోపు బడిబయట ఉన్న బాలబాలికలను గుర్తిస్తున్నారు. వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అసలు బడిలో చేరకుండా, బడిలో చేరి కూడా 30 రోజులకు పైగా గైర్హాజరవుతున్న బాలబాలికలను గుర్తిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 300 మంది లాంగ్ డ్రాపౌట్స్ అయినట్లు గుర్తించారు. వారిని తిరిగి పాఠశాలలకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సర్వేలో బాలబాలికల వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

జిల్లాలో 300 మంది గుర్తింపు

జిల్లాలో బడిబయట ఉన్న పిల్లల వివరాలను సేకరించేందుకు 81 మంది సీఆర్పీలతో సర్వే చేయిస్తున్నాం. సర్వే ముగిసే నాటికి గుర్తించిన పిల్లలను పాఠశాలలకు పంపించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 300 మందిని గుర్తించాం. ఈ నెల 10తో సర్వే ముగుస్తుంది. వందశాతం లక్ష్యం సాధించే దిశలో ముందుకెళ్తున్నాం.

- సుశీందర్‌రావు, రంగారెడ్డి డీఈవో

చర్యలు తీసుకుంటున్న విద్యాశాఖ

నెల రోజులుగా జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో సీఆర్పీలు ఇంటింటి సర్వేను ముమ్మరంగా చేపడుతున్నారు. ఇందుకోసం వారు ఇంటింటికెళ్లి అన్ని విషయాలను ఆరా తీస్తున్నారు. సర్వేలో గుర్తించిన పిల్లలను వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్పించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటున్నది. సదరు బాలబాలికలను అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్కూళ్లు, కేజీబీవీల్లో అర్హతను అక్కడ చేర్పిస్తున్నారు.

ఎంపికైన క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెద్దఅంబర్‌పేట, జనవరి 8 : మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని వ్యాస్ మాడల్ పాఠశాల విద్యార్థులు మల్కంబ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం నుంచి ఈ నెల 12 వరకు మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న పోటీల్లో పాల్గొంటున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ప్రతినిధులు సర్వేశ్వర్‌రెడ్డి, కోచ్ నీలేశ్ అభినందనలు తెలిపారు. బాలికల జట్టులో వెన్నెల, రేవతి, యశస్విని, కావ్య, రోహిత, బాలుర జట్టులో రామ్, రంజిత్, చరణ్, ప్రభు, పరశురాం ఉన్నట్టు నీలేశ్ చెప్పారు. మరోవైపు, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఎస్సార్ కాలేజీ విద్యార్థిని వెన్నెలను కాలేజీ ప్రిన్సిపాల్ సుధాధ, తెలంగాణ మల్కంబ్ అసోసియేషన్ సెక్రటరీ దిలీప్‌గవానీ, జిల్లా అసోసియేషన్ సెక్రటరీ దిలీప్ అభినందించారు.

వివేకానందుడు అందరికీ ఆదర్శప్రాయుడు

చేవెళ్లటౌన్, జనవరి 8 : స్వామి వివేకానంద అందరికీ ఆదర్శప్రాయుడని సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్లలోని వివేకానంద కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి, డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతల వితరణ

షాబాద్, జనవరి 8 : అయోధ్యలోని శ్రీరాముడి అక్షింతల వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీరాముడి అక్షింతలను ఊరేగించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో అక్షింతలకు అర్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యేశ్వరి, మాజీ జడ్పీటీసీ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మిర్జాగూడలో..

శంకర్‌పల్లి : అయోధ్యలోని శ్రీరాముడి అక్షింతలను మండలంలోని మిర్జాగూడ గ్రామంలో సోమవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు.

దేవునిఎర్రవల్లిలో..

చేవెళ్ల రూరల్ : దేవునిఎర్రవల్లిలో ప్రతి ఇంటికీ అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేసినట్లు సర్పంచ్ మాణిక్యరెడ్డి అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు రాములు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

చెంచులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏవో అరుణకుమారి

పీఎం 'జన్‌మన్'ను వినియోగించుకోవాలి

మండల వ్యవసాయ శాఖ అధికారిణి అరుణకుమారి

ఆమనగల్లు, జనవరి 8 : చెంచు జాతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపి వారికి వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా పీఎం జన్‌మన్ (ప్రధానమంత్రి జన్ జాతీయ ఆదివాసీ న్యాయ్ అభియాన్) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి అరుణకుమారి అన్నారు. ఈ పథకంలో 11 రకాల ముఖ్యమైన సౌకర్యాలు పొందొచ్చన్నారు. అందులో భాగంగా సోమవారం ఆమనగల్లు రెవెన్యూ పరిధిలోని శంకర్‌కొం డతండా, ఆమనగల్లుకు చెందిన చెంచు రైతులతో అరుణకుమారి సమావేశమై రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రైతు బంధు, రైతు బీమా, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి, కిసాన్ క్రెడిట్ కార్డులు లాంటి ఇతర పథకాలు అందాలంటే ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలు తప్పనిసరిగా ఉండాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్ నయూముద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారి శివతేజ, ప్రభుత్వ దవాఖాన మెడికల్ అధికారి పరీక్షిత్, ఎంపీహెచ్‌వో తిరుపతిరెడ్డి, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శంకర్, చెంచు సంఘం నాయకుడు జంగయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పాటుపడాలి

చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మొయినాబాద్, జనవరి 8 : ప్రభుత్వాలు.. ప్రజాప్రతినిధులు మారినా పేదల సంక్షేమానికి పాటుపడాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గల రైతువేదికలో 88 మంది లబ్ధిదారులకు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీపీ నక్షత్రం, జడ్పీటీసీ శ్రీకాంత్‌తో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని కొనియాడారు. గత ప్రభుత్వంలో మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మమత, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీవో సంధ్య, ఆర్ఐ చంద్రమోహన్, ఏఈవో సునాల్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే

మండలంలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న చిలుకూరు భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మూడోరోజైన సోమవారం సాయంత్రం మల్లికార్జునస్వామి ఉత్సవ విగ్రహాలను చిలుకూరు గ్రామంలో హనుమాన్ ఆలయం నుంచి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ఎంపీ, చేవెళ్ల ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందించారు. వారిని ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశ్‌కురుమ సన్మానించారు. కార్యక్రమంలో వెంకటాపూర్ సర్పంచ్ మనోజ్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, యువత విభాగం మండలాధ్యక్షుడు పరమేశ్, నాయకులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాసం

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం, జనవరి 8 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 17 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాలంటూ సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మొత్తం 24మంది కౌన్సిలర్లుండగా.. అందులో 15మంది బీఆర్ఎస్.. ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా సంతకాలు చేసి అందించారు. గతంలోనూ ఆమె పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని పేర్కొంటూ అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అవిశ్వాసాలపై అప్పట్లో సానుకూలంగా స్పందించకపోవటంతో తాత్కాలికంగా వాయిదా పడింది. సోమవారం మరోసారి అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ వినతిపత్రం అందజేశారు.

నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీల చైర్‌పర్సన్లపై అవిశ్వాసాలు

నియోజకవర్గంలో నాలుగు మున్సిపాలిటీలుండగా.. అందులో మూడు మున్సిపాలిటీల చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. దీంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రాజకీయం మరోమారు రసకందాయంగా మారింది. పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తిక, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతిలపై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. ప్రస్తుతం వీరంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. కాగా.. పెద్దఅంబర్‌పేట, ఆదిబట్ల మున్సిపాలిటీల చైర్‌పర్సన్లపై కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లే అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. ఇబ్రహీంపట్నంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 17మంది కౌన్సిలర్లు ఒకే తాటిపై ఉన్నారు.

చెంచు, ఆదివాసీల అభివృద్ధికి కృషి

డీటీడీవో రామేశ్వరీదేవి

కడ్తాల్, జనవరి 8 : చెంచు, ఆదివాసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ సంక్షేమాధికారిణి రామేశ్వరీదేవి అన్నారు. జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని చెంచు కాలనీలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో వసతులు, ఇండ్లు, భూములు, ఉపాధి హామీ జాబ్ కార్డులున్నాయా లేదా తదితర విషయాలపై వారు ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ నెల 15న మండల కేంద్రంలోని గిరిజన వసతి గృహంలో ఈ పథకంపై ప్రధానమంత్రితో వర్చువల్ మీటింగ్ ఉంటుందని.. కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని 11 గ్రామాల్లో ఉంటున్న చెంచులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీసర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, హెచ్‌డబ్ల్యూవో రామచంద్రయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


చెంచు కుటుంబాలతో సమావేశమైన డీటీడీవో రామేశ్వరీదేవి, తహసీల్దార్ ముంతాజ్

91 మద్యం సీసాలు స్వాధీనం

శంకర్‌పల్లి, జనవరి 8 : బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మోకిల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్‌లో బబ్లూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించి.. అతడి నుంచి 91 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

దర్గా ఉత్సవాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఉర్సును విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు, జనవరి 8 : జహంగీర్ పీర్ దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంకర్ వక్ఫ్‌బోర్డు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జహంగీర్ పీర్ దర్గా వక్ఫ్‌బోర్డు కార్యనిర్వాహణ అధికారి అబ్దుల్ సత్తార్, కొత్తూరు ఎస్ఐ, వివిధ శాఖల అధికారులతో దర్గా ఉర్సుపై సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించాలి

సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్

షాబాద్, జనవరి 8 : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలను సాగు చేయాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ముదిరాజ్‌భవన్‌లో జరిగిన సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ముద్దెంగూడ, తిర్మలాపూర్, ఎర్రోనిగూడ, బొబ్బిలిగామ, గొల్లూరుగూడ గ్రామాల్లోని రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రతలు, సస్యరక్షణ చర్యలపై సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉచిత ప్రమాద బీమాపై రైతులకు వివరించారు. డ్రోన్ ద్వారా వివిధ రకాల పంటలకు మందుల పిచికారీ.. ఆసక్తి ఉన్న రైతులకు తేనెటీగలు, ఔషధ మొక్కల పెంపకం, నూనెగింజల సాగు వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ మండల అధ్యక్షుడు లింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 8 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో సాగర్ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యాచారం మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన రహీం(40), శివకుమార్(29) ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి తమ స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా కారు(టీఎస్ 28డీ 2628) బైక్‌ను గురునానక్ కళాశాల వద్ద బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, రహీంకు తీవ్ర గాయాలు కాగా.. నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కడ్తాల్, జనవరి 8 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రామేశ్వరీదేవి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని గిరిజన వసతి గృహంతోపాటు ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. హాస్టల్‌లో స్టడీ ఆవర్స్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ నెల 15న వసతి గృహంలో నిర్వహించనున్న 'పీఎం జన్‌మన్' పథకంపై ప్రధానమంత్రితో వర్చువల్ మీటింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వార్డెన్ రాములు, అధికారులు నర్సింహారెడ్డి, నరేందర్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

మిట్ట మధ్యాహ్నం.. పాతికేండ్ల లోపు అమ్మాయి..

పెట్రోలు పోసి.. తగులబెట్టి..

- మొయినాబాద్ డ్రీమ్ వ్యాలీ సమీపంలో సంచలన ఘటన
- ఎక్కడో చంపి ఇక్కడికి తీసుకొచ్చినట్లుగా అనుమానిస్తున్న పోలీసులు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన రాజేంద్రనగర్ అదనపు డీసీపీ రష్మీ, ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి
- రంగంలోకి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు
- హత్య కేసు నమోదు.. మొయినాబాద్ పోలీసుల దర్యాప్తు

మొయినాబాద్, జనవరి 8 : అది జనాలు తిరిగే ప్రాంతం.. సమీపంలోనే డ్రీమ్ వ్యాలీ రిసార్ట్.. అయినా మిట్ట మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పాతికేండ్ల లోపు వయసున్న ఓ అమ్మాయి మృతదేహాన్ని పెట్రోలు పోసి గుర్తుతెలియని దుండగులు తగులబెట్టారు. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడుతుండడంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు అక్కడికెళ్లి చూడగా మంటల్లో శరీరం కాలుతున్నట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి వచ్చేసరికి 90 శాతానికి పైగా గుర్తించలేని స్థితిలో ఉన్నది. ఆ గుర్తు తెలియని యువతిని దుండగులు ఎక్కడో చంపి ఇక్కడికి తీసుకొచ్చి మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ముఖ్యంగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఆ యువతి బ్లూ కలర్ జీన్స్ పాయింట్ వేసుకున్నట్లుగా తేలడంతో కాలేజీ విద్యార్థిని అయి ఉండొచ్చా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొయినాబాద్ సమీపంలోని డ్రీమ్ వ్యాలీ సమీపంలో సోమవారం పట్టపగలు జరిగిన దారుణ ఘటన సంచలనం రేకెత్తిస్తున్నది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని ఓ మహిళ(25)ను దుండగులు ఎక్కడో దారుణంగా హత్య చేసి ఆ మృతదేహాన్ని బాకారం రెవెన్యూలోని డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్ సమీపంలోని రోడ్డుపక్కన పట్టపగలు పడేశారు. ఆమె ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు పెట్రోల్ పోసి తగులబెట్టారు. బాకారం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు వచ్చే సరికి ఆ మృతదేహం తొంభై శాతానికి పైగా కాలిపోయింది. ఘటనా స్థలాన్ని రాజేంద్రనగర్ అదనపు డీసీపీ రష్మీపరిమళ్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు.

రంగంలోకి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, ఎస్‌బీ బృందాలు

ఓ యువతిని దారుణంగా హత్య చేసి పెట్రోల్ పోసి తగులబెట్టిన దుండగులను గుర్తించేందుకు పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, ఎస్‌బీ బృందాలను రంగంలోకి దించారు. క్లూస్ టీం బృందం మృతదేహం వెంట్రుకలు, సగం కాలిన సెల్‌ఫోన్‌ను సేకరించింది. మృతదేహాన్ని తీసుకొచ్చిన దారిలో డాగ్‌స్క్వాడ్‌లు కొంతదూరం వెళ్లి తిరిగివచ్చాయి. అమ్మాయిని హత్య చేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని.. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మొయినాబాద్ పోలీసులు తెలిపారు.

ఫోన్ డేటా ఆధారంగా వివరాలు రాబట్టే పనిలో పోలీసులు..

ఆ యువతి వద్ద ఉన్న మొబైల్ కూడా మంటల్లో కాలిపోయింది. క్లూస్ టీం ఆమె తలవెంట్రుకలు, ఆమె వద్ద ఉన్న ఫోన్‌ను సేకరించింది. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపే పనిలో పోలీసులున్నారు. ఫోన్‌లో ఉండే కాల్ డేటా ఆధారంగా ఆమెకు ఎవరు ఫోన్ చేశారు.. ఆమె అడ్రస్ ఎక్కడ అని తెలుసుకునేందుకు పోలీసులు సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యా